క్లుప్తంగా

24న ఎన్నికలు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలో ఈనెల 24న గిరిజన ప్రైమరీ కో–ఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి శైలజ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు డైరెక్టర్ పదవుల కోసం మాడా గెస్ట్‌హౌస్‌లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. గిరిజన ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు కార్డుతో రావాలని సూచించారు.

వాలీబాల్ టోర్నమెంట్

కాటారం: మండలంలోని కొత్తపల్లిలో ఈ నెల 24, 25న కాల్నేని రామకృష్ణ, సంతోష్ స్మారకార్థం కాటారం, మల్హర్ మండలాల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు స్వామి, అశోక్, రాజు, రణధీర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంట్రీ ఫీజు రూ.300 చెల్లించి జట్టు పేరు నమోదు చేసుకోవాలన్నారు. గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతి రూ.5016, ద్వితీయ బహుమతి రూ.3016తో పాటు షీల్డులు అందించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు సెల్ నంబర్లు 98666 95499ను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

ప్రభాకర్‌ను కలిసిన రాజ్‌కుమార్

కాటారం: బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన బొడ్డు రాజ్‌కుమార్ శుక్రవారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్‌ను కరీంనగర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. నియామకానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపినట్లు రాజ్‌కుమార్ తెలిపారు.

పరీక్షకు సకాలంలో హాజరు కావాలి

ములుగు రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల ప్రవేశ పరీక్ష ఈ నెల 23న నిర్వహిస్తున్నట్లు జాకారం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. టీజీ సెట్–2025 ప్రవేశ పరీక్ష కేంద్రంలో జాకారం గురుకుల పాఠశాలను ఎంపిక చేశారని అన్నారు. 5 తరగతి నుంచి 9వ తరగతి వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పరీక్ష ఉంటుందని అన్నారు. విద్యార్థులు ఉదయం 09 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని అన్నారు. జాకారం గురుకుల పాఠశాలలో 546 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. విద్యార్థులు హాల్‌టికెట్‌తో పాటు బ్లూ, బ్లాక్ బాల్‌పాయింట్ పెన్, ప్యాడ్, వాటర్ బాటిల్, ఆధార్‌కార్డు వెంట తెచ్చుకోవాలని సూచించారు.

హాస్టల్‌లో వైద్యశిబిరం



వాజేడు: మండల కేంద్రంలోని స్థానిక ఎస్సీ హాస్టల్‌లో శుక్రవారం డాక్టర్ యోషిత ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థినులకు పరీక్షలు నిర్వహించారు. దగ్గు, జలుబుతో బాధపడుతున్న వారికి మందులను పంపిణీ చేశారు. ఆరోగ్యంపై తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలను వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీనివాస్, వెంకటరమణ, అమూల్య, చిన్న వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

బియ్యం అందజేత

ఎస్ఎస్ తాడ్వాయి: మండల కేంద్రంలోని తాడ్వాయి గ్రామానికి చెందిన ఇర్ప సమ్మక్క ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు పరామర్శించి 50 కిలోల బియ్యం, ఆర్థిక సాయం అందజేశారు. పీఏసీఎస్ మాజీ చైర్మన్ పాక సాంబయ్య, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు పాక రాజేందర్ ఉన్నారు.

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్న ఉపాధ్యాయులు
- మార్చి 21నుంచి పదో తరగతి పరీక్షలు



చిట్యాలలో తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు

చిట్యాల: పదో తరగతి విద్యార్థులకు మార్చి 21 నుంచి పబ్లిక్ పరీక్షలకు ప్రారంభం కానున్నాయి. మండలంలో మొత్తం తొమ్మిది ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. చిట్యాల, జడలపేట, జూకల్, చల్లగరిగ, గోపాలపూర్, నైన్‌పాక, కస్తూరిబా గాంధీ, మోడల్‌స్కూల్, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో మొత్తం పదో తరగతి విద్యార్థులు 305 మంది ఉన్నారు. పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణతతో పాటు విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ప్రతి రోజు పాఠశాల సమయానికి ముందు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. రోజులకు రెండు సబ్జెక్టుల చొప్పున ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ చదువుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. విద్యార్థుల్లో ఉన్న భయాన్ని తొలగించేందుకు ప్రతీరోజు పరీక్షలు నిర్వహిస్తున్నారు. పరీక్షల సమయంలో ఒత్తిడి గురికాకుండా ఉండేందుకు సూచనలు ఇస్తున్నారు.

ప్రశాంతంగా చదువుకోవాలి



పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా చదువుకోవాలి. కష్టపడి చదువుకుని మంచి మార్కులు సాధించాలి. ఉపాధ్యాయులతో ఎప్పటికప్పుడు రివ్యూ సమావేశాలు నిర్వహిస్తున్నాం. విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం

– కొడెపాక రఘుపతి, ఎంఈఓ, చిట్యాల

ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం..



మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ప్రతీ రోజు పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. అలాగే రోజు పరీక్షలు నిర్వహించి విద్యార్థుల్లో భయం పోయేలా చేస్తున్నాం. పరీక్షలు ఏలా సిద్ధం కావాలో శిక్షణ ఇస్తున్నాం. పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేదుకు కృషి చేస్తున్నాం.

– రఘుపతి, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు, చిట్యాల

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే గండ్ర



ప్రమాద స్థలంలో ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించి మానవత్వం చాటుకున్నాడు వివరాల్లోకి వెళ్లితే.. శుక్రవారం ఉదయం ఏడు గంటలకు భూపాలపల్లి ప్రధాన జాతీయ రహదారిపై మాంటిస్సోరీ స్కూల్ మైసమ్మ ఆలయం వద్ద హనుమకొండ నుంచి భూపాలపల్లి బట్టల షాపునకు దుస్తులను తీసుకువస్తున్న టాటా ఎస్ వాహనం డీవైడర్‌కు ఢీకొని ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో వాహన డ్రైవరుతో పాటు మరోకరికి గాయాలయ్యాయి. క్యాంపు కార్యాలయం నుంచి భూపాలపల్లికి వస్తున్న ఎమ్మెల్యే ప్రమాద ఘటన వద్దకు వెళ్లి 108 వాహనాన్ని పిలిపించి క్షతగాత్రులను జిల్లా ప్రధాన 100 పడకల ఆస్పత్రికి తరలించి, నాణ్యమైనా వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. ఆపదలో ఎమ్మెల్యే చూపిన చొరవకు అక్కడున్న స్థానికులు ఎమ్మెల్యేకు అభినందనలు తెలిపారు. కాగా, ఎమ్మెల్యే వెంట టీపీసీసీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్ ఉన్నారు.

ఘనంగా సేవాలాల్ జయంతి



భోగ్ భండారో నిర్వహిస్తున్న బంజార కుల పెద్దలు

కాటారం: మహాముత్తారం మండలం రేగులగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని పోచంపల్లిలో సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ పద్ధతిలో భోగ్ భండారో నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. బంజార మహిళలు, యువతులు సంప్రదాయ దుస్తులు ధరించి నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, బంజార సంఘం, లంబాడ హక్కుల పోరాట సమితి నాయకులు, బంజార కులపెద్దలు, కులస్తులు పాల్గొన్నారు.

ఘనంగా మాతృభాష దినోత్సవం



నైన్‌పాకలో మాతృభాష దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

చిట్యాల: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలతో పాటు మండలంలోని నైన్‌పాక, జూకల్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని తెలుగు ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాతృభాషా అమ్మ భాష అని అన్నారు. మాతృభాష గొప్పతనం, దాని ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కొడెపాక రఘుపతి, ఆయా పాఠశాలాల ప్రధానోపాధ్యాయులు శ్రీరాం రఘుపతి, గిరగాని కృష్ణ, ఉపాధ్యాయులు గడ్డం శంకర్, మౌనిక, రాజమౌళి, ఫిజికల్ డైరెక్టర్ సాంబమూర్తి, నిలీమారెడ్డి, ప్రణీత, స్వాతి, విజయశాంతి, రమేష్, రాజయ్య, ఓదేలు, నాగరాజు, సీఆర్పీ తిరుపతి, రాధిక రాణి, మమత, ఉమాదేవి పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీ



బ్యాగులను తనిఖీ చేస్తున్న పోలీసులు

వాజేడు: మండల పరిధిలోని చెరుకూరు గ్రామం వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం పోలీసులు స్నీఫర్ డాగ్‌తో తనిఖీలను నిర్వహించారు. వెంకటాపురం(కె) సీఐ బండారి కుమార్, పేరూరు ఎస్సై రాజ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను సోదాలు చేశారు. ప్రతీ వాహనాన్ని ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేశారు. అలాగే దుకాణాల్లో సోదాలు నిర్వహించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై అవగాహన

వాజేడు: మండలంలోని టేకులగూడెం గ్రామంలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై లబ్ధిదారులతో అధికారులు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు, జిల్లా హౌజింగ్ పీడీ సూర్య నారాయణ, ఏఈ ఇషాక్ హుస్సేన్ మాట్లాడారు. మండలంలో పైలెట్ ప్రాజెక్టు కింద టేకులగూడెం ఎంపిక కాగా 123 మందికి ఇందిరమ్మ ఇంటి నిర్మాణ హక్కు పత్రాలను గతంలోనే అందజేశామన్నారు. లబ్ధిదారులు అందరు ఇంటి నిర్మాణం కోసం ముగ్గు పోసుకోవాలని రూ.5 లక్షల వ్యయంలోపు ఇంటి నిర్మాణం చేసుకోవాలన్నారు. విడతల వారిగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ అవుతుందని సూచించారు.

ఆరోపణలు చేయడం సరికాదు

- బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవి



మాట్లాడుతున్న సట్ల రవి

టేకుమట్ల: భూపాలపల్లిలో జరిగిన రాజలింగమూర్తి హత్యతో బీఆర్ఎస్ పార్టీకి సంబంధం లేదని పార్టీ మండల అధ్యక్షుడు సట్ల రవి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేతలు కావాలనే బీఆర్ఎస్ నాయకులపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. హత్య విషయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేసిన వ్యాఖ్యాలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. హత్యకు భూవివాదాలే కారణామని స్థానికులు, పోలీసులు చెబుతున్నప్పటికీ కాంగ్రెస్ నేతలు కేసీఆర్, కేటీఆర్, రమణారెడ్డిలపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. రాజలింగమూర్తి హత్యకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఆకునూరి తిరుపతి, ఉపాధ్యక్షుడు సదానందం, మాజీ ఎంపీపీ నరేష్, నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, మహేష్ యాదవ్, రవీందర్, లింగారెడ్డి, లక్ష్మణ్, ప్రభాకర్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు చేయాలి

- రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అమ్జద్‌పాషా



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ములుగు రూరల్: రైతులు పండించిన పత్తిని సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోలు చేయాలని రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అమ్జద్‌పాషా అన్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ సంపత్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో సుమారు 15 వేల ఎకరాలలో పత్తి పంట సాగు చేశారని అన్నారు. సాంకేతిక కారణాలతో సీసీఐ కొనుగోళ్లు నిలిపి వేసి వారం రోజులు గడుస్తుందని తెలిపారు. వర్షాల కారణంగా ఆలస్యంగా పత్తి దిగుబడి వస్తుందని ఈ నెల చివరి వరకు సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు చేపట్టి రైతులను ఆదుకోవాలని అన్నారు. సీసీఐ కొనుగోళ్లు నిలిపివేయడంతో రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించి నష్టపోతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ముత్యాల రాజు, ఇంజం కొమురయ్య, రమేశ్, సమ్మయ్య, పైడి, రవి పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

వాజేడు: వెంకటాపురం(కె) మండల కేంద్రంలో మార్చి 9న నిర్వహించే న్యాయ కళాశాల సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి ఆధ్వర్యంలో శుక్రవారం కరపత్రాలను విడుదల చేశారు. మండల పరిధిలోని గుమ్మడిదొడ్డి గ్రామంలో శుక్రవారం జీఎస్పీ సంక్షేమ పరిషత్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీల కోసం భద్రాచలం కేంద్రంగా న్యాయ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరుతూ ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాజబాబు, సుధాకర్, గణపతి, వెంకటేశ్వర్లు, ఆనంద్, నవీన్, శ్రీనాథ్, శ్రీకాంత్, రవి, ప్రశాంత్, విష్ణు తదితరులు ఉన్నారు.

మండల కమిటీ ఎన్నిక



శ్రీకాంత్, అధ్యక్షుడు

ఏటూరునాగారం: తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పత్తిపాక రామువర్మ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో బీసీ సంఘం మండల కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాంనగర్ గ్రామానికి చెందిన గడబోయిన శ్రీకాంత్‌ను ఉపాధ్యక్షుడిగా వంగపండ్ల రవి, కార్యదర్శిగా అల్లంల చంటి, కోశాధికారిగా నరేందర్, ప్రచార కార్యదర్శిగా వడ్కాపురం సారయ్యను ఎన్నుకున్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు



తాగునీటి బోరు ఏర్పాటు చేస్తున్న జీపీ కార్యదర్శి, సిబ్బంది

కాటారం: కాటారం గ్రామ పంచాయతీ పరిధిలోని కాలనీల్లో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతీ కార్యదర్శి షగీర్‌ఖాన్ తెలిపారు. మండలంలోని ఎర్రగుంటపల్లిలో తాగునీటి సరఫరా పథకం బోరు ఏర్పాటు చేసి నీటి పునరుద్ధరణ చేపట్టారు. మిషన్ భగీరథతో పాటు కాలనీల్లో ఏర్పాటు చేసిన బోర్‌వెల్ ద్వారా తాగునీరు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. తాగునీటి సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలో ఇంటర్ కీలకం

- ఆర్‌సీఓ హరిసింగ్



మాట్లాడుతున్న ఆర్‌సీఓ హరిసింగ్

ఏటూరునాగారం: విద్యార్థి దశలో ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం కీలకమని గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ హరిసింగ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. విద్యార్థులు సంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హరిసింగ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రమశిక్షణతో కూడిన విద్య భవిష్యత్‌కు బాటలు వేస్తోందన్నారు. రాబోయే పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అశోక్, ఎస్సై తాజొద్దీన్, లేడి ఎంపవర్‌మెంట్ జిల్లా అధికారి తోట రమాదేవి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు రాజేంద్రప్రసాద్, వెంకటేశ్వర్లు, శంకర్, భిక్షం రాజు, రాజ్‌కుమార్, రవిచంద్ర, ఉపేందర్, రామకృష్ణ, కార్తీక్, నరేష్ పాల్గొన్నారు.

ఆసరా అయితారనుకుంటే.. దేవుడు దూరం చేసిండు!

- రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ములు మృతి
- గుండెలవిసేలా రోదించిన తల్లిదండ్రులు, బంధువులు



రాజు కుమార్, శంకర్(ఫైల్)



ప్రమాదం జరిగిన స్థలం

నడికూడ : ఎదిగిన కొడుకులు ఆసరా అయితారనుకున్నాం.. దేవుడు మా బిడ్డలను దూరం చేసిండంటూ తల్లిదండ్రులు రోదించిన తీరును చూసిన ప్రతి ఒక్కరూ కంటతడిపెట్టుకున్నారు. మండలంలోని కంఠాత్మకూర్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనం ఢీకొని అన్నతమ్ములు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. దామెర పోలీసుల కథనం ప్రకారం.. భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం నాచారం గ్రామానికి చెందిన ఉప్పుల చంద్రానికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు రాజు కుమార్ (25) హనుమకొండలో ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. చిన్న కొడుకు శంకర్ (22) ఐటీఐ చదువుతున్నాడు. గురువారం రాత్రి అన్నదమ్ములతో పాటు, వారి స్నేహితుడు కాటారం మండలం గంగారం గ్రామానికి చెందిన బండారి శివకుమార్ ముగ్గురు కలిసి ద్విచక్ర వాహనంపై హనుమకొండ నుంచి ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో కంఠాత్మకూర్ హనుమన్ గుడి వద్ద వీరి బైక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో రాజు అక్కడికక్కడే మృతి చెందగా, శంకర్‌ను చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రాణాలొదిలాడు. తీవ్ర గాయాలతో శివకుమార్ చికిత్స పొందుతున్నాడు. సంఘటన స్థలాన్ని పరకాల రూరల్ సీఐ రంజిత్‌రావు పరిశీలించారు. మృతి చెందిన వారి తండ్రి చంద్రం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు దామెర ఎస్సై కొంక అశోక్ పేర్కొన్నారు.

ఒకరికి గాయాలు

కమలాపూర్ : మండలంలోని వంగపల్లి గ్రామ శివారులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం రామకృష్ణాపూర్‌కు చెందిన నాంపెల్లి మహేష్ (35) మండలంలోని మర్రిపల్లిగూడెంలో తాపీ మేస్త్రీ పనికి వచ్చాడు. అక్కడ నుంచి తన బైక్‌పై పరకాలకు వెళ్తుండగా వంగపల్లి గ్రామ శివారులోకి రాగానే గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లింది. ఈ ప్రమాదంలో మహేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స అందిస్తూ వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు 108 సిబ్బంది ఈఎంటీ బండ ఉపేందర్, పైలెట్ కుమారస్వామి తెలిపారు. కాగా మహేష్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

దూరంగా పోలింగ్ కేంద్రాలు

- ఓటు వేసేందుకు ప్రజల ఇబ్బందులు
- సమీపంలో ఏర్పాటు చేయాలని వినతి



ఓటు వేసేందుకు బారులుదీరిన ఓటర్లు (ఫైల్)



పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై ఎంపీడీఓ విజయకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు(ఫైల్)

వాజేడు: మండలంలో ఏడు ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. అందులో మొరుమూరు ఎంపీటీసీ స్థానం ఒకటి కాగా ప్రగళ్లపల్లి గ్రామంలో పోలింగ్ కేంద్రం ఉంది. వాజేడు మండలానికి చెందిన బొల్లారం గ్రామం ప్రగళ్లపల్లి పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓట్లు వేయాలంటే సుమారుగా 8 కిలో మీటర్ల మేర ప్రయాణం చేయాల్సి ఉంటుంది. అదే విధంగా ఆరుగుంటపల్లి ఓటర్లు ప్రగళ్లపల్లికి వచ్చిఓటు వేయ్యాలంటే మూడు కిలో మీటర్ల రావల్సిన పరిస్థితి. ఈ క్రమంలో ఆరుగుంటపల్లి, బొల్లారం గ్రామాలను కలుపుతూ ఆరుగుంటపల్లిలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఆరుగుంటపల్లి గ్రామం వాజేడు, భద్రాచలం రహదారి పక్కన ఉండడంతో అన్ని విధాలుగా సౌకర్యంగా ఉంటుందని తెలుపుతున్నారు.

ఏడ్జర్లపల్లి ఎంపీటీసీ స్థానంలో ఉన్న మండపాక ఓటర్లు నాలుగు కిలోమీటర్లు ఉన్న ఏడ్జర్లపల్లి పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేయాల్సి ఉంది. కానీ మండపాకు కేవలం 200 మీటర్ల దూరంలో అదే ఎంపీటీసీ పరిధిలోని పూసూరు పోలింగ్ కేంద్రం ఉంది. ఇక్కడి గ్రామ ఓటర్లు పూసూరులో ఓట్లు వేసేలా అవకాశం కల్పిస్తే బాగుంటుందని స్థానికులు కోరుతున్నారు. అదే విధంగా కృష్ణాపురం ఎంపీటీసీ స్థానంలోని పెద్దగంగారం ఓటర్లు సుమారుగా మూడు కిలో మీటర్లు వెళ్లి కృష్ణాపురంలో ఓటు వేయ్యాలి. పెద్దగంగారానికి పక్కన సుమారు 300 మీటర్ల దూరంలో ఉన్న అదే ఎంపీటీసీ పరిధిలోని టేకులగూడెం పోలింగ్ కేంద్రంలో అవకాశం కల్పిస్తే అనుకూలంగా ఉంటుందని తెలుపుతున్నారు. ఈ విషయాలపై అఖిలపక్ష నాయకులు వినతిపత్రం రూపంలో అధికారులను కోరారు. ఓటర్లు ఇబ్బందులు పడుతున్నారని వచ్చే ఎన్నికల సమయానికి పోలింగ్ కేంద్రాలు దగ్గరగా ఉండే విధంగా చూడాలని కోరుతున్నారు.

వివరాలు పంపించాం..

దూరంగా వెళ్లి ఓట్లు వేయాడినికి ఓటర్లు ఇబ్బందులు పడుతున్నారని అఖిల పక్ష నాయకులు తెలుపడం జరిగింది. ఈ మేరకు ఆరుగుంటపల్లిలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు, దూరంగా ఉన్న పెదగంగారం, మండపాక గ్రామాలకు చెందిన ఓటర్లకు దగ్గరి పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓట్లు వేసేలా వివరాలను ఉన్నాతాధికారులకు పంపించాం.

– ఎంపీడీఓ విజయ

ఉద్యమకారుల హామీలను నెరవేర్చాలి

వెంకటాపురం(ఎం): తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని టీయూఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంటి భద్రయ్య కోరారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని పోస్టాఫీస్ వద్ద పోస్ట్‌కార్డు ఉద్యమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమకారులు చేసిన పోరాటాలు, త్యాగాల వల్లనే తెలంగాణ రాష్ట్రం ఏర్పటైందన్నారు. ఉద్యమకారులను గత ప్రభుత్వం పట్టించుకోలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. ఉద్యమకారులకు 250 గజాల ఇంటిస్థలం, గుర్తింపుకార్డులు, ప్రత్యేక సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీయుఎఫ్ నాయకులు దగ్గు ప్రభాకర్‌రావు, అబ్బు గోపాల్‌రెడ్డి, ఎండీ.రహీమొద్దిన్, గాజుల శ్రీనివాస్, నర్రా భద్రయ్య, శెట్టి శ్రీధర్ పాల్గొన్నారు.